సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023

రాజన్నకు ప్రత్యేక హోమాలు

వేములవాడ: రాజన్న ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్వామి వారికి ఆలయ అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలు జరిపించారు. అనంతరం మహామంటపంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఏఈవో శ్రీనివాస్, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

పారదర్శకంగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

సిరిసిల్ల: ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేస్తున్నామని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సిరిసిల్ల ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అఖిల పక్షం సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితాను పరిశీలించి తప్పులు ఉంటే తెలియజేయాలన్నారు. 18, 19 ఏళ్ల యువతీ, యువకుల ఓటర్ల నమోదు జెండర్ నిష్పత్తి సమాచారాన్ని అందించారు. బూత్ లెవల్ ఆఫీసర్ల జాబితా, సమ్మరి రివిజన్ షెడ్యూల్, ఓటర్ల నమోదు, తొలగింపు, అడ్రస్ మార్పులకు సంబంధించిన ఫామ్–6, 7, 8లకు సంబంధించిన సమాచారాన్ని తెలిపారు.

అదనపు కలెక్టర్‌గా గౌతమ్‌రెడ్డి



గౌతమ్‌రెడ్డిని సన్మానిస్తున్న అడిషనల్ డీఆర్‌డీవో

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బి.గౌతమ్‌రెడ్డి బుధవారం విధుల్లో చేరారు. అదనపు కలెక్టర్‌గా పనిచేసిన బి.సత్యప్రసాద్ ఖమ్మం జిల్లాకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో జెడ్పీ సీఈవోగా ఉన్న గౌతమ్‌రెడ్డిని పూర్తి స్థాయి ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా కలెక్టర్ అనురాగ్ జయంతి నియమించారు. ఈ మేరకు గౌతమ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గౌతమ్‌రెడ్డిని డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి ఏ.రవీందర్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, ఎంపీడీవోలు చిరంజీవి, శంకర్‌నాయక్, జిల్లా అధికారులు శాలువాతో సన్మానించి, పూల గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల నిలిపివేత

బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్ మానేరు) ప్రాజెక్టు నుంచి కరీంనగర్ ఎల్‌ఎండీ ప్రాజెక్టులోకి నీటి విడుదల బుధవారం నిలిపివేశారు. ప్రాజెక్టులోకి వేయి క్యూసెక్కుల మేర వరద ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టులో 20.07 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.



సిరిసిల్ల శివారులోని పెద్దూరు వద్ద సిద్ధమైన మెడికల్ కాలేజీ భవనం



మెడికో హబ్ కన్నారం

- రేపు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- ఉమ్మడి జిల్లాలో ఆరుకు చేరనున్న మెడికల్ కాలేజీల సంఖ్య
- సర్కారు కాలేజీల్లో ఏటా 500 మందికి అడ్మిషన్లు
- ప్రైవేటు కలిపితే అందుబాటులో దాదాపు 950 సీట్లు

కాలేజీ	సీట్లు	పడకలు
సిరిసిల్ల	100	300
కరీంనగర్	100	500
రామగుండం	150	330
జగిత్యాల	150	330
ప్రైవేటు	450సీట్లు	

సిరిసిల్ల, కరీంనగర్‌లో మెడికల్ కాలేజీలు రెడీ

వైద్యరంగం అభ్యున్నతిలో భాగంగా మెడికల్ కాలేజీల స్థాపనకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల అనుమతులు సాధించిన తొమ్మిది మెడికల్ కాలేజీలను ఒకేసారి శుక్రవారం సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన సిరిసిల్ల, కరీంనగర్ వైద్యకళాశాలలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇటీవల కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలవడం తెలిసిందే. అదే సమయంలో ఈ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ కూడా ఊపందుకుంది. ఈ కాలేజీల రాకతో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య నాలుగుకు చేరుకోగా, ప్రైవేటుతో కలుపుకుంటే వీటి సంఖ్య ఆరుకు చేరుకోవడం గమనార్హం. మొత్తం కాలేజీల్లో అన్ని కలిపి 950 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

2000 సంవత్సరం కరీంనగర్‌లో ఒక్క వైద్య కళాశాల కూడా లేదు. 2003 తర్వాత రెండు ప్రైవేటు కాలేజీలు మాత్రం వచ్చాయి. రెండేళ్ల క్రితం జగిత్యాల, రామగుండం కాలేజీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ప్రస్తుతం రెండు కాలేజీల్లో రెండో సంవత్సరం తరగతులు కూడా విజయవంతంగా నడుస్తున్నాయి. ఈ రెండు కాలేజీల భవనాల నిర్మాణం కూడా అదేస్థాయిలో ఉంది. ఇక రామగుండం మెడికల్ కాలేజీకి కావాల్సిన నిధులు రూ.510 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాల ఖర్చును భరించేందుకు సింగరేణి ముందుకువచ్చింది. దీంతో ఆ కాలేజీ పేరును సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (సిమ్స్)గా మార్చారు. మొత్తం 150 సీట్లలో 24 సీట్లు ఆలిండియా రిజర్వేషన్ ప్రకారం కేటాయిస్తారు. మిగిలిన 126 సీట్లలో 5శాతం సింగరేణి కార్మికుల పిల్లలకు రిజర్వేషన్ కింద అందజేస్తారు. 7 సీట్లు రాష్ట్రంలోని సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక రిజర్వేషన్ పద్ధతిన కేటాయించనున్నారు. దీంతోపాటు జగిత్యాల మెడికల్ కాలేజీలో 150 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కాలేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.510 కోట్లు కేటాయించింది. 27.5 ఎకరాల సువిశాల ప్రాంగణంలో కాలేజీ నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో తరగతులు నడుస్తున్నాయి.

ఇటీవలే టెండర్లు

ఇక ఈ ఏడాదే అనుమతి వచ్చిన కరీంనగర్, సిరిసిల్ల కాలేజీల భవనాల నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇందులో కరీంనగర్ రూ.104.5 కోట్లు, రూ.107.3 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొంది. 15 నెలల్లో ఈ భవనాలను నిర్మించాలని టెండరు నోటీసులో పేర్కొంది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కాలేజీల పరంగా చూసుకుంటే మొత్తం 600 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి ప్రైవేటు కాలేజీలైన చలిమెడ 250 సీట్లు, ప్రతిమ 200 సీట్లు కూడా కలుపుకుంటే మొత్తం 950 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఒక్క కరీంనగర్‌లోనే 550 మెడికల్ సీట్లు వైద్య విద్యార్థులకు అందుబాటులో ఉండటం విశేషం.

1,460 పడకలు అందుబాటులోకి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్కారు మెడికల్ కాలేజీ వల్ల సామాన్యులకు వైద్యం అందుబాటులోకి రానుంది. కరీంనగర్ 500, రామగుండం 330, సిరిసిల్ల 300, జగిత్యాల 330 పడకలు ఆయా కళాశాలల్లో అందుబాటులోకి వచ్చాయి. కరోనా లాంటి విపత్తులు సంభవించినపుడు ప్రజలకు అన్ని రకాల వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంటాయని వైద్యనిపుణులు భరోసా ఇస్తున్నారు.


సీఎంకు, మంత్రికి కృతజ్ఞతలు



పేదలకు సేవలు అందించాలన్న కృతనిశ్చయంతో అన్ని జిల్లాలో సీఎం కేసీఆర్ ఏర్పాటు చేస్తోన్న వైద్యకళాశాలలు రాష్ట్ర ప్రతిష్టను పెంచుతాయి. ఇందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు. ఇప్పటికే మెడికల్ హబ్‌గా ఉన్న రాష్ట్రం ముున్ముందు రోజుల్లో మెడికోలకూ హబ్‌గా మారనుంది.

– డా.బీఎన్ రావు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు

దేశానికి అన్నం, వైద్యం



ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఎదిగి, దేశానికి అన్నం పెడతాం. సీఎం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల వల్ల ఇది సాధ్యమైంది. ఆయన అదే ముందుచూపుతో రాష్ట్రంలో పేదలకు, సామాన్యులకు వైద్య సేవలు అందాలన్న సంకల్పంతో ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ అన్న సాహోసోపేతమైన నిర్ణయం తీసుకుని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో తయారైన వైద్యులు దేశానికి వైద్యం చేస్తారు.

– గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి

ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఓటర్ల నమోదు కోసం ఆఫ్‌లైన్‌లో వచ్చిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఏపీఎంలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఫొటో సిమిలర్ ఎంట్రీల డెస్క్ పరిశీలన పకడ్బందీగా చేయాలన్నారు. పొరపాటున ఓటరు జాబితా నుంచి ఎవరి పేరైనా డిలిట్ అయితే తిరిగి చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. అన్ని ఫారాలను ఆన్‌లైన్ చేస్తూ తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, బి.గౌతమ్‌రెడ్డి, ఆర్డీవోలు ఎన్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, సీపీవో శ్రీనివాసచారి, డీపీవో రవీందర్, జిల్లా లేబర్ ఆఫీసర్ రఫీ, ఎన్నికల విభాగం అధికారులు పాషా, రహమాన్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల: గణేశ్ నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల పద్మనాయక ఏసీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గణేశ్ నవరాత్రులను మతసామరస్యంతో నిర్వహించాలన్నారు. ఈ ఏడాది మిలాద్ ఉల్ నబీ, గణేశ్ నిమజ్జనం ఒకే రోజు వస్తున్నాయని వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. గణేశ్ మండపాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పోలీసులు భద్రత కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీజే సౌండ్స్‌ను నిషేధించామని తెలిపారు. సమావేశంలో సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, టౌన్ సీఐ ఉపేందర్, ఎస్సై ప్రేమనందం, రాజు పాల్గొన్నారు.

డీఅడిక్షన్ సెంటర్

సిరిసిల్లలో 'ఆపరేషన్ విముక్తి' పేరుతో డీఅడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారిని సన్మార్గంలోకి తెచ్చేందుకు ఈ సెంటర్ ఉపయోగపడుతుందని వివరించారు. సైకాలజిస్ట్, సైకియాట్రిస్ట్ డాక్టర్లతో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు వాటిని మానేయలేని స్థితిలో ఉంటే తల్లిదండ్రులు గుర్తించి సమీప పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేయాలని ఎస్పీ కోరారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

క్రైమ్ రేటు తగ్గించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): విధి నిర్వహణలో రోల్ క్లారిటీ, గోల్ క్లారిటీపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి క్రైమ్ రేటు తగ్గించాల ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ ఉదయ్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏ తరహా కేసులు ఎక్కువ నమోదవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లుగా నమోదవుతున్న కేసులను పరిశీలించారు. సీజ్ చేసిన, అబాండెడ్ వాహనాలను పరిశీలించి త్వరగా డిస్పోజల్ చేయాలని, ఐదు ఎస్‌లను పాటించాలని సూచించారు. రిసెప్షన్, ఫంక్షనల్, వర్టికల్స్ విధుల గురించి వివరించారు. సిబ్బంది ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహిస్తున్నందుకు ఎస్సై వెంకటేశ్వర్లును అభినందించారు. ఎస్పీ వెంట సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, రూరల్ సీఐ సదన్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'డబుల్' కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

సిరిసిల్ల: డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ అన్నారు. పట్టణ శివారులోని రగుడు, పెద్దూరు వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాలను బుధవారం పరిశీలించారు. రోడ్లు, మంచినీటి వసతి, విద్యుత్ సౌకర్యం, మురికి నీటి వ్యవస్థ వంటి మౌలిక వసతులు, పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తి కాగానే లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తామని వివరించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఆయాజ్, సిరిసిల్ల తహసీల్దార్ ఎండీ. షరీఫ్ మొహియొద్దీన్, డబుల్ బెడ్రూం జిల్లా ఇన్‌చార్జి అధికారి భాస్కర్, సెస్, మున్సిపల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



ఇళ్ల సముదాయాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రైతుబీమా చిక్కులకు చెక్

బీమా సమస్యలపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొత్త రైతులకు బీమా చిక్కులకు చెక్ పడింది. బీమా పత్రాల జారీ సమస్యలపై కలెక్టర్ డా.బి.గోపి సమగ్రంగా ఆరా తీశారు. కొత్త రైతులకు బీమా పత్రాలు రాకపోవడమేంటని వ్యవసాయశాఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా భూములను కొనుగోలు చేసిన కర్షకులకు బీమా పత్రాలు రాకపోవడంపై ఈ నెల 9న 'కొత్త రైతులకు బీమా చిక్కులు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొత్త రైతులకు బీమా పత్రాలను జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. బీమా క్లైయిమ్ సెటిల్‌మెంట్, రైతు కుటుంబాల పత్రాలను సైట్‌లో పొందుపర్చడం, ఎల్ఐసీ ఐడీల విషయంలో ఎప్పటికప్పుడు పరిష్కారం ఉండాలని జిల్లా వ్యవసాయశాఖను ఆదేశించారు.

కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

కోనరావుపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి సీహెచ్. మోహన్ అన్నారు. బుధవారం కోనరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మమేకమై మాట్లాడారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశం నిర్వహించి ఈ విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. ఈఏడాది ప్రథమ సంవత్సరంలో అత్యధిక మంది అడ్మిషన్లు తీసుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు. డ్రాపవుట్లు లేకుండా చూసుకోవాలన్నారు.

మంచం పట్టిన తండాలు

- గిరిజనాన్ని పట్టి పీడిస్తున్న జ్వరాలు
- కన్నెత్తి చూడని వైద్య సిబ్బంది

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండలం మానాల శివారు గిరిజన తండాల్లో విషజ్వరాలు వణిస్తున్నాయి. ప్రజారోగ్యం పడకేసింది. ఇంటింటా జ్వరం, వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులతో బాధ పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తండాల్లో వైద్య సిబ్బందిని పంపి పరీక్షలు నిర్వహించి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

పారిశుధ్యలోపంతోనే విషజ్వరాలు

గిరిజన తండాల్లో పారిశుధ్య లోపంతోనే విషజ్వరాలు ప్రబలుతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణ మందు పిచికారి చేయకపోవడం, డ్రెయినేజీలు, నీటి నిల్వ ప్రదేశాల్లో బ్లీచింగ్ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఒక ఇంట్లో ఒకరికి జలుబు, ఒళ్లు నొప్పులు, వాంతులతో జ్వరం వస్తే అది ఇంట్లోని అందరికీ వ్యాపిస్తోంది. ఒకరికొకరు చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది. మారుమూల గిరిజన తండాల ప్రజలు విషజ్వరాలతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని భయంతో కాలం వెల్లదీస్తున్నా ఏ ఒక్క ప్రభుత్వ వైద్యుడు వచ్చిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముసురు ప్రభావంతోనే..

వారం రోజుల క్రితం ముసురుపట్టి కురిసిన వర్షాల ప్రభావంతోనే గిరిజన తండా గ్రామాల్లో నీటి కాలుష్యం, పారిశుధ్యలోపం తలెత్తి వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామ, మండల అధికారులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే సమస్య పరిష్కారమవుతుందని గిరిజనులు పేర్కొంటున్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తాం

వాతావరణ పరిస్థితులతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. వైద్య పరీటలు నిర్వహిస్తాం. తండాల్లో ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉంది. బడితండాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడిని నియమించాం. వైద్య సేవలు వినియోగించుకోవాలి. గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం.

– డాక్టర్ సుమన్‌మోహన్ రావు, జిల్లా వైద్యాధికారి, రాజన్న సిరిసిల్ల



మంచంలో పడుకొని ఉన్న ఈ అవ్వ పేరు బానోతు అంజీ. దెగావత్‌తండాకు చెందిన అంజీకి పది రోజులుగా జ్వరం వస్తోంది. పెద్దాస్పత్రికి వెళ్లే స్థోమత లేక రుద్రంగిలోని ఆర్ఎంపీ వద్దకెళ్లి చూపించుకొని రూ.5వేలు ఖర్చు చేసి మందులు తెచ్చుకుంది. అయినా జ్వరం తగ్గలేదని వాపోతోంది.



మంచం పట్టిన ఇతని పేరు గుగులోతు సంతోష్. తూక్యాతండాకు చెందిన ఇతనికి మూడు రోజులుగా జ్వరం వస్తోంది. సోమవారం రాత్రి దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో బడితండా గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే అక్కడ వైద్యులు లేకపోవడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షించి మందులిచ్చి ఇంటికి పంపారు. జ్వరం అలాగే ఉంది.



ఇంటి ఎదుట గద్దెపై నీరసంగా కూర్చున్న ఈ గిరిజన మహిళ పేరు గుగులోతు హీరవ్వ. వీరునితండాకు చెందిన ఈమె 15 రోజులుగా జలుబు, కీళ్ల నొప్పులు, వాంతులు, విష జ్వరంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చూపించుకొని రూ.6వేలు ఖర్చు చేసినా జ్వరం, నొప్పులు అలాగే ఉండి నడుం లెవ్వకుండా అయిందని అంటోంది. అటవీ ప్రాంతంలో ఉండే తమకు క్రిమికీటకాలతో విషజ్వరాలు వస్తున్నాయని తండాల్లో డాక్టర్లు పరీక్షలు చేసి మందులు ఇస్తే మంచిగుండని కోరుతోంది.



మంచంపై పడుకున్న ఇతని పేరు గుగులోతు బసు. బడితండాకు చెందిన ఇతడికి మూడు రోజులుగా జ్వరం వస్తోంది. ఊర్లో ఆర్ఎంపీకి చూపించుకునేందుకు చేతిలో చిల్లి గవ్వ లేక జ్వరంతో ఇంట్లోనే మూలుగుతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఊర్లోని ప్రభుత్వ ఆస్పత్రికి పోదామంటే అక్కడ పెద్ద డాక్టర్ లేకపాయే. అప్పు చేసి పట్నంలోని పెద్ద ఆస్పత్రికి వెళ్దామంటే ఎన్ని డబ్బులు గుంజుతారో నని భయమేస్తోంది. సర్కారు డాక్టర్లు వచ్చి మాలాంటి బీద వారికి పరీక్షలు చేసి మందులు ఇస్తే మంచిగుండు. లేకపోతే జ్వరంతో చచ్చిపోతామేమోనని భయమేస్తుంది.

క్లుప్తంగా

విద్యార్థులకు ఎస్పీ అభినందన



అభినందిస్తున్న ఎస్పీ

సిరిసిల్లఅర్బన్: హైదరాబాద్‌లో ఈనెల 10న నిర్వహించిన నేషనల్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన విద్యార్థులను ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం అభినందించారు. కార్యక్రమంలో గొజిరాయ్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ జవేరియా బేగం పాల్గొన్నారు.

24 మంది డీజే యజమానుల బైండోవర్



మాట్లాడుతున్న సీఐ ఉపేందర్

సిరిసిల్ల: పట్టణంలోని 24 మంది డీజే సౌండ్స్ యజమానులను బుధవారం బైండోవర్ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. గణేశ్ నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద అనుమతి లేకుండా పోలీసుల సూచనలను అతిక్రమించి డీజే సౌండ్స్ ఏర్పాటు చేస్తే డీజేలను సీజ్ చేసి వాటి యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈమేరకు పట్టణంలోని 24 మందిని సిరిసిల్ల తహసీల్దార్ ముందు హాజరు పరిచినట్లు సీఐ వివరించారు.

'ఆయుష్మాన్ భవ' ప్రారంభం వీక్షణ



వర్చువల్‌గా వీక్షిస్తున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్లటౌన్: ఆయుష్మాన్ భవ వెబ్‌కాస్ట్ కార్యాలయాలను దేశవ్యాప్తంగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి ఆఫీసులో డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావుతో పాటు సిబ్బంది వీక్షించారు. ఆయుష్మాన్‌భవ పథకం ద్వారా ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలను డీఎంహెచ్‌వో అధికారులకు వివరించారు.

కోతుల దాడిలో పంటలు ధ్వంసం



ధ్వంసమైన పత్తిపంట

కోనరావుపేట: మండలంలోని కనగర్తి గ్రామ శివారులో సాగు చేస్తున్న రావులపెల్లి రాజిరెడ్డి, పోగుల రాజిరెడ్డిలకు చెందిన పత్తిపంటపై బుధవారం కోతులు దాడి చేసి పంట ధ్వంసం చేశాయి. కొంతకాలంగా పంటలపై కోతుల దాడులు ఎక్కువయ్యాయని, కోతుల నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదివరకు చాలామంది రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి పంటలపై దాడులు చేసి ధ్వంసం చేశాయని వాపోయారు.

మృతుడి గుర్తింపు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ శివారులోని వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన వ్యక్తిని మొర్రాయిపల్లెకు చెందిన లక్కడి బాల్‌రెడ్డి గుర్తించినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లిన బాల్‌రెడ్డి బావిలో పడి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అదృశ్యం



జంపిరెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన జంగ జంపిరెడ్డి కనిపించడం లేదని కుటుంబసభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటలో సూపర్‌మార్కెట్ నిర్వహించే జంపిరెడ్డి వేములవాడ రాజన్న దర్శనానికి ఈనెల 12న ద్విచక్రవాహనంపై వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు బంధు మిత్రులకు ఫోన్ చేసి ఆరా తీశారు. బంధు మిత్రుల ఇళ్లల్లో గాలించిన ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆందోళనలతో దద్దరిల్లిన సిరిసిల్ల

- పాతబస్టాండ్‌లో అఖిల పక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో
- ఆర్డీవో ఆఫీసు ఎదుట అంగన్‌వాడీల ధర్నా
- ముగ్గులతో సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన
- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజక కార్మికుల ధర్నా

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం నిరసనలు.. నినాదాలతో దద్దరిల్లింది. బుధవారం పట్టణ నలుమూలల్లో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. పాతబస్టాండులో అఖిలపక్షం రాస్తారోకో నిర్వహించగా.. ఆర్డీవో ఆఫీసు ఎదుట వందలాది సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ధర్నా చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తాలో సమగ్ర శిక్షా ఉద్యోగులు, కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న కార్మికులు బైఠాయించి ప్రభుత్వ తీరుపై నిరసనలు తెలిపారు.

'మధ్యాహ్న' వంట కార్మికుల నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులు

ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన వంట కార్మిక సంఘాలు వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. అదే ప్రాంతంలో బీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో రిలేదీక్షలు చేపట్టారు. పెంచిన జీతం డబ్బులను ఇప్పటికీ అందించలేదని, కోడిగుడ్లు, మెస్‌చార్జీలు పెంచాలని బీఆర్‌ఎస్‌కేవీ అనుబంధ సంఘం ప్రతినిధులు గొట్టె దేవేంద్ర, సంతోష, లత, విజయ తదితరులు డిమాండ్ చేశారు. 55 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని ఏఐటీయూసీ అనుబంధ సంఘం ప్రతినిధులు మీస లక్ష్మన్, నడిగొట్టు లక్ష్మి, సావిత్రి, మహేశ్వరి, కడారి రాములు, అజ్జ వేణు తదితరులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్‌లో వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు.



బీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో..

రోడ్డుపై ముగ్గులతో..



రోడ్డుపై ముగ్గులేసి సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

తమ ఉద్యోగాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపై ముగ్గులేసి నిరసనలతో హోరెత్తించారు. పనికి సమాన వేతనాలివ్వాలని, మహిళ ఉద్యోగులకు మెటర్నిటీ లీవులను అమలు చేయాలని, సమగ్ర శిక్షలో అసువులు బాసిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ కయ్యూం, కత్తి జయలక్ష్మి, చిప్ప నవీన్, నీరజ, శ్రీనివాస్, సలీం, నరేష్, వెంకటస్వామి, ఉపేందర్ పాల్గొన్నారు.

మల్కపేట రిజర్వాయర్‌కు నర్సయ్య పేరుపెట్టాలి



పాతబస్టాండులో అఖిలపక్ష పోరాట కమిటీ రాస్తారోకో

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే కర్రోళ్ల నర్సయ్య పేరును మల్కపేట రిజర్వాయర్‌కు పెట్టాలని అఖిలపక్ష పోరాట కమిటీ జిల్లా చైర్మన్ రాగుల రాములు డిమాండ్ చేశారు. బుధవారం పాతబస్టాండులో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో మాట్లాడారు. సిరిసిల్ల ప్రాంత బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన జీవితాన్ని ధారబోశారని కొనియాడారు. నిజాములు, దేశాయిలపై పేదప్రజల భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన యోధుడుగా నరసయ్యను పేర్కొన్నారు. మల్కపేట రిజర్వాయర్‌కు ఆయన పేరును పెట్టాలని ప్రభుత్వానికి సూచిస్తూ కలెక్టర్ రావాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు కల్పించుకుని బలవంతంగా ఆందోళన విరమింపజేశారు

అంగన్‌వాడీలవి న్యాయమైన డిమాండ్లు

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే. మహేందర్‌రెడ్డి అన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు బుధవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల సమ్మెను భగ్నం చేసేలా ప్రభుత్వ కుట్రలు మానుకోవాలని హెచ్చరించారు. దశాబ్దాలుగా అధిక పనిభారం, తక్కువ వేతనాలతో జీవితాలు వెళ్లదీస్తున్న అంగన్‌వాడీల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, ఉపాధ్యక్షురాలు కల్వకుంట్ల పద్మ, శ్యామల, నాగలక్ష్మి, అంజలి, సైదాషఫి, అయేష, సుధారాణి, పద్మ, వాణి, జ్యోతి, స్వరూప, శారద, శైలజ, కవిత తదితరులు పాల్గొన్నారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ఆర్టీసీకి కలిసొచ్చిన శ్రావణమాసం

- 27 రోజుల ఆదాయం రూ.6,59,30,533
- నష్టాల్లో నుంచి లాభాల బాటలో..

ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 12 వరకు వచ్చిన ఆదాయం వివరాలు

డిపో	రోజులు	ఆదాయం	లాభాలు
సిరిసిల్ల	27	రూ. 3,14,33,618	రూ. 34లక్షలు
వేములవాడ	27	రూ. 3,44,96,915	రూ. 65 లక్షలు

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి భక్తులు నిత్యం తరలివస్తుంటారు. శ్రావణమాసంలో భక్తులు స్వామివారి వద్దకు ఉపవాసాలు, భక్తిశ్రద్ధలతో వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు.ఈ శ్రావణమాసం, రాఖీ పండుగకు ఆర్టీసీకి కలిసివచ్చింది. 27 రోజుల్లో రూ.6,59,30,533 ఆదాయం సమకూరింది. ఏటా నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలు ఈఏడు లాభాలబాటలో నడుస్తున్నాయని ఆర్టీసీ అధికారులు తెలుపుతున్నారు. ఏదిఏమైనా ఆర్టీసీకి మంచి రోజులు కలిసివచ్చాయని అధికారులు అంటున్నారు.

జిల్లాలో రెండు ఆర్టీసీ డిపోలు

రాజన్న సిరిస్లిల జిల్లాలో వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. సిరిసిల్ల డిపోలో 66 బస్సులు ఉండగా.. 270 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. రోజుకు 26 వేల కిలోమీటర్లు, 20 వేల ప్రయాణికులు ద్వారా 9.50 లక్షల ఆదాయం వస్తుంది. కరీంనగర్–సిరిసిల్ల నాన్‌స్టాప్ బస్సులు, వరంగల్ రూట్ బస్సులు ఎక్కువగా నడుస్తుంటాయి. వేములవాడ డిపోలో 59 బస్సులు నడుస్తుండగా 239 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. బస్సులు ఒక్కో రోజు సుమారుగా 27 వేల కిలోమీటర్లు ప్రయాణించి 20వేల ప్రయాణికులతో సుమారు రూ.10.50 లక్షల ఆదాయం వస్తుంది. వేములవాడ డిపో నుంచి అధికంగా రూట్ల బస్సులే కాకుండా హైదరాబాద్‌కు రోజుకు 48 ట్రిప్పులు నడుస్తుంటాయి. అలాగే పల్లెవెలుగు బస్సులు జగిత్యాలకు 12, కోరుట్లకు 7 ట్రిప్పులు నడుస్తుంటాయి. ఈ రూట్‌లలోనే అధికంగా ఆదాయం సమాకూరుతుంది. ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల్లో ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన టీ 9 (60), టీ 9 (30) ఆఫర్ల ద్వారా కూడా మంచి ఆదాయం సమాకూరుతోంది.



వేములవాడ ఆర్టీసీ బస్టాండ్

సమష్టి కృషితో లాభాలు

ఆర్టీసీ డిపో ఉద్యోగుల అందరి సమష్టి కృషితో లాభాల్లో నడుస్తుంది. రాజన్న భక్తులకు, ప్రయాణికులకు ఎవరికి ఇబ్బంది కలగకుండా, సరైన సమయంలో రద్దీని బట్టి బస్సులు నడిపిస్తూ నష్టాల్లో ఉన్న డిపోను లాభాల బాట పట్టించడం జరిగింది..

– మురళీకృష్ణ, వేములవాడ డిపో మేనేజర్

వేలిముద్ర వేయాల్సిందే

- రేషన్‌కు కుటుంబసభ్యులందరి ఈ–కేవైసీ తప్పనిసరి
- బియ్యం దుర్వినియోగం, అనర్హులకు చెక్
- జిల్లాలో ప్రారంభమైన ప్రక్రియ

జిల్లా సమాచారం

రేషన్ దుకాణాలు
345
అంత్యోదయ కార్డులు
13,702
ఆహార భద్రత కార్డులు
1,60,060
అన్నపూర్ణ కార్డులు
210

గంభీరావుపేట(సిరిసిల్ల): రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా, రేషన్ కార్డులో అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియ ప్రారంభమైంది. అసలైన లబ్ధిదారులకే రేషన్ సరుకులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కార్డులో పేర్లు ఉన్న కుటుంబసభ్యులందరూ చౌకధరల దుకాణానికి వచ్చి ఈ–కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు రేషన్ డీలర్లు అనుసంధాన ప్రక్రియను జిల్లాలో ప్రారంభించారు. కొత్త రేషన్ కార్డులను జారీ చేయడానికి ముందు ప్రభుత్వం అనర్హులైన వారి కార్డులు తొలగించేందుకు చర్యలు చేపట్టింది.

రేషన్ దుకాణాల్లోనే ఈ–కేవైసీ

ఆహార భద్రత కార్డు(రేషన్‌కార్డు)లో ఉన్న కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. కార్డులో పేరున్న ఏ కుటుంబసభ్యులైన దుకాణానికి వెళ్తే రేషన్ బియ్యం అందిస్తున్నారు. అయితే కొన్ని కార్డుల్లో కొందరు చనిపోవడం, కూతుర్లు పెళ్లిళ్లు చేసుకొని అత్తారింటికి వెళ్లిపోయారు. అయినా వాళ్లందరికి నేటికీ బియ్యం అందుతూనే ఉన్నాయి. బియ్యం దుర్వినియోగం కావొద్దనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కార్డులోని సభ్యులందరి పేర్లు ధ్రువీకరించుకోవడానికి చౌకధరల దుకాణానికి వచ్చి ఈ–పాస్ యంత్రంలో వేలిముంద్రలు వేయాలని నిర్ణయించింది. డీలర్లు ఈ–కేవైసీ పునరుద్ధరించుకోవాలని లబ్ధిదారులకు సమాచారం అందిస్తున్నారు. వేలిముద్రలు రాకుంటే ఐరిష్ ద్వారా అనుసంధానం చేస్తున్నారు. కాగా, రేషన్ కార్డులోని సభ్యుల ఈ–కేవైసీ ప్రక్రియ డీలర్లకు తలనొప్పిగా మారనుంది. వృద్ధుల, పిల్లల వేలిముద్రలు రాకపోవడం, కొంత మంది లబ్ధిదారులు విదేశాల్లో, పట్టణాల్లో వివిధ పనుల నిమిత్తం స్థిర పడ్డారు. వారు రాకపోతే కార్డులో నుంచి వారి పేర్లు తొలగించే అవకాశం ఉంది.



వేలిముద్రలు సేకరిస్తున్న రేషన్ డీలర్

ఈ–కేవైసీ చేయించుకోవాలి

రేషన్ కార్డులో పేరున్న ప్రతీ లబ్ధిదారు చౌకధరల దుకాణాల్లో ఈ–కేవైసీ చేయించుకోవాలి. కుటుంబసభ్యులందరూ దుకాణానికి వెళ్లి వేలిముద్రలు వేయాల్సి ఉంది. రేషన్ డీలర్లు అనుసంధాన ప్రక్రియ అమలు చేస్తున్నారు.

– జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు

- ప్రవర్తన నియమావళి పాటించాలి
- సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎన్నికల వేళ రాజకీయ పార్టీల నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిపేటలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏ ఒక్కరు వ్యక్తిగతంగా, రాజకీయంగా, కులమతాలకు సంబంధించిన విషయాలపై వ్యాఖ్యలు చేయవద్దన్నారు. ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు ప్రచారం చేసుకోవాలన్నారు. పోలీసు అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సైలు రమాకాంత్, మహేశ్, రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోనరావుపేట: మండలంలోని కనగర్తి మూలవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యజమాని పుట్ట చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేశామన్నారు. మూలవాగు పరివాహక గ్రామాల్లో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్‌పై ప్రజాదరణే పార్టీకి బలం

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీపై పెరుగుతున్న ప్రజాదరణే పార్టీకి బలమని ఏఐసీసీ కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి క్రిస్టోఫర్ తిలక్ అన్నారు. బుధవారం సిరిసిల్లలోని డీసీసీ ఆఫీసులో జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌తో పాటు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, శాసనసభ ఎన్నికల్లో పోటీకి దరఖాస్తులు చేసుకున్న నేతలతో సమీక్షించి మాట్లాడారు. సెప్టెంబర్ 17న జరిగే సోనియా సభను విజయవంతం చేయాలని సూచించారు. 18న ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ నుంచి వచ్చే నాయకుడి ద్వారా సోనియాగాంధీ ప్రకటించే ఐదు గ్యారెంటీ పథకాలపై ప్రెస్‌మీట్, డోర్ టూ డోర్ ప్రచారం చేయబడుతుందన్నారు. 19న బీఎల్ఎల్‌లను నియమించి శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే. మహేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, నాయకులు చీటి ఉమేష్‌రావు, సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, జాలుగం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



డీసీసీ ఆఫీసులో నాయకులతో చర్చిస్తున్న తిలక్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కోనరావుపేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ అన్నారు. బుధవారం కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలకు సంబంధించి బడ్జెట్ విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను అందించాలన్నారు. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించి, రాయితీపై గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయాలని తెలిపారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు సూరం పద్మ, కమల, మరియ, తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు



చందుర్తి (వేములవాడ): పేద ప్రజల, కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు అన్నారు. బుధవారం బండపల్లిలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు గడ్డం తిరుపతిరెడ్డి స్థూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. గ్రామాల్లోని భూములు లేని నిరుపేద ప్రజలకు మూడెకరాల భూమి, ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూంలను అందజేస్తామని అధికారంలోకి వచ్చి నిరుపేదలను మోసం చేసిందన్నారు. సీపీఐ దళిత మోర్చా అధ్యక్షుడు కోరెపు క్రాంతికుమార్, నాయకులు దేవయ్య, దుర్గయ్య, మత్యం, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి గుట్టపై సందడి





వేములవాడ రాజన్న అనుబంధ ఆలయమైన నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. నాంపల్లి గుట్టపైకి వచ్చిన భక్తులు నరసింహుడికి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. కాళీయమార్ధనంలోని నాగదేవతకు పాలుపోసి పూజలు నిర్వహించారు. గుట్టపై ఎక్కడ చూసిన వాహనల రద్దీ, భక్తుల సందడి కనిపించింది.

– వేములవాడఅర్బన్